సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షా ప్రశ్నాపత్రాలను స్కూల్ పాయింట్ వద్దకే చేర్చాలి

ఎస్టీయు జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శిలు ఎస్వీ రమణమూర్తి, రమణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షా ప్రశ్నాపత్రాలను స్కూల్ పాయింట్ వద్దకే చేర్చాలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్టీయు జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శిలు ఎస్వీ రమణ మూర్తి, జి.రమణ లు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులు ఉదయానికే పాఠశాలకు చేరుకొని ఆ తర్వాత ఆత్రుతగా పరీక్ష ప్రశ్నాపత్రాలు తీసుకోవడానికి వెళ్లి ఉపాధ్యాయులు ప్రమాదాలకు గురైన సందర్భాలు మనం చాలా చూశామని, గతంలో చిత్తూరు జిల్లాలో ఒక ఉపాధ్యాయుడు ప్రశ్నాపత్రాలకు వెళ్లి వస్తుండగా యాక్సిడెంట్ జరిగి మరణించడం కూడా జరిగిందన్నారు. ఇటువంటి ప్రమాదాలు జరిగిన తర్వాత కూడా అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టకుండా ఉపాధ్యాయులే మండల విద్యాశాఖా కార్యాలయాలకు మరియు కాంప్లెక్స్ పాఠశాలలకు వచ్చి పరీక్షా ప్రశ్నా పత్రాలు తీసుకువెళ్లాలని ఆదేశాలు జారీ చేయడం తగదన్నారు.

మత్యకారుడు మృతిపై విచారం వ్యక్తం చేసిన జిల్లా నెయ్యల కుల సంఘ అధ్యక్షులు దువ్వారపు గురునాథ్

విశాలాంధ్ర - పోలాకి: మత్స్యకారుడు అంజలి అప్పన్న నరసన్న పేట మండలం మడవం గ్రామానికి చెందిన మత్స్యకారుడు వంశధార నదిలో వేటకు వెళ్లి మృతి చెందాడు. దీంతో గ్రామం మొత్తం దుఃఖ:సాగరంలో మునిగిపోయింది. అలాగే జిల్లా నెయ్యిల కుల సంఘ అధ్యక్షుడు దువ్వారవు గురునాథ్ విచారం వ్యక్తం చేశారు. సంఘటన తెలుసుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని అక్కడ పరిస్థితిని గురించి తెలుసుకున్నారు. మృతిచెందిన మత్స్యకారుని కుటుంబానికి తన సంతాపాన్ని తెలియజేస్తూ ప్రభుత్వం సదరు కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు ఇవ్వాలని, వేట చేసే సమయంలో మృతి చెందిన మత్స్యకారుల కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావలసిన ఎక్స్‌గ్రెషియా విషయమై జిల్లా మత్స్య శాఖ అధికారులతో ఆయన మాట్లాడి ఆ కుటుంబానికి వీలైనంత వేగంగా ఆర్థిక సహాయం అందేటట్లు కృషి చేస్తానని పోలాకిలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మడవం మత్స్యకార సంఘ అధ్యక్షులు కోసు పార్వతీశం, అంబాజీపేట మత్స్యకార సంఘ అధ్యక్షులు రమణ మరియు ఇతర మత్స్యకార పెద్దలు పాల్గొని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఆధార్ సేవలను వినియోగించుకోండి

కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లా ప్రజలందరికీ ఆధార్ సేవలు సులభంగా అందించేందుకు ప్రభుత్వం సమగ్ర ప్రణాళికను అమలు చేస్తోందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. "జిల్లాలోని 732 గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రతి ఐదు సచివాలయాలకు ఒక ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 146 ఆధార్ కిట్లు అందుబాటులోకి తీసుకువచ్చామని వివరించారు. ఇంకా 37 కేంద్రాలు ఈ నెలాఖరుకు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఆధార్‌కు సంబంధించిన కొత్త కార్డు నమోదు, డాక్యుమెంట్ అప్‌డేట్, 5 నుండి 7 సంవత్సరాలు మరియు 15 నుండి 17 సంవత్సరాల వయసుగలవారి మాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్, మొబైల్ నెంబర్ అనుసంధానం వంటిసేవలు ఈ ఆధార్ కేంద్రాల్లో లభ్యమవుతున్నాయని కలెక్టర్ వెల్లడించారు. "ప్రజల సౌలభ్యార్థం ప్రతి నెలలో 8 రోజుల పాటు గ్రామ వార్డు సచివాలయ శాఖ ఆధ్వర్యంలో క్యాంప్ మోడ్‌లో ఆధార్ సేవలు అందిస్తున్నారన్నారు . అవసరమున్న ప్రాంతాలను గుర్తించి సంబంధిత సచివాలయా ల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించబడతాయని, ప్రజలు తమ పరిధిలో క్యాంప్ ఎప్పుడు జరుగు తుందో సచివాల యాలను సంప్రదించి, ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆరేళ్ల లోపు పిల్లలు తమ జనన తేదీ వివరాలతో సమీప ఆధార్ కేంద్రాన్ని సంప్రదించి ఆధార్ నమోదు చేయించుకోవాలి ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రకటనలో కోరారు.

వోల్టెకు 30 మంది ఐతమ్ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర -టెక్కలి: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2025 విద్యా సంవత్సరంలో ఈఈఈ బిటెక్ మరియు డిప్లొమో కోర్సులను పూర్తి చేసిన 30 మంది విద్యార్థులు చెన్నై కేంద్రంగా ఉన్న వోల్టెక్ ఇంజినీర్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక వేతనంగా ఒక్కొక్కరికి రూ. 2.5 లక్షలు చెల్లించడంతో పాటు రవాణా, భోజన వసతి సౌకర్యాన్ని ఆ కంపెనీ కల్పిస్తుందని డైరెక్టర్ పేర్కొన్నారు. ఈఈఈ బిటెక్ విద్యార్థులు 23 మంది, డిప్లొమో ఈఈఈ విద్యార్థులు 07 గురు వోల్టెక్కు ఎంపికయ్యారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావుతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్ డిలు డాక్టర్ డి.విజయ్కుమార్, బి.శ్రీనివాసరావు, టిపిఒ డాక్టర్ ఎం.ఎస్.వి.ఎస్.ఎస్.కుమార్ తదితరులు విద్యార్థులను అభినందిస్తూ అంకిత భావంతో విధులను నిర్వహించి కళాశాలకు, సంస్థకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు.

గిరిజన గ్రామాలను షెడ్యూల్ జాబితాలో చేర్చాలి

- ఐటిడిఏ ఏర్పాటు చేయాలి - మౌలిక సౌకర్యాలు కల్పించాలి

ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర-మందస: జిల్లాలో ఐటిడిఎ లేక గిరిజన ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని, ఐటిడిఎ ఏర్పాటు చేసి గిరిజన ప్రజల హక్కులు రక్షించాలని ఆదివాసి గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మందస తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సవర గురునాథ్, జిల్లా కమిటీ సభ్యులు సవర ఫల్గుణ రావు లు మాట్లాడుతూ గిరిజన భూములు ఆక్రమణలు ఆపాలని, గిరిజన గ్రామాల్లో మౌలిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. గిరిజన సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపడం లేదని, ప్రభుత్వం ఇప్పటికైనా సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని, గిరిజన గ్రామాలను షెడ్యూలు జాబితాలో చేర్చాలని, 50శాతం పైగా గిరిజనులు ఉన్న పంచాయతీలను విడదీసి గిరిజన పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు.మాణిక్యపట్నంలో మంచి నీటి సమస్య పరిష్కారం చేయాలని, కొండాలోగాం పంచాయతీలో భూ ఆక్రమణలు నివారించాలని, గిరిజనులు సాగులో ఉన్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుడంబో లో స్మశానం సమస్య పరిష్కారం చేయాలని ఒరిస్సా సరిహద్దు గ్రామాలలో సరిహద్దు సమస్యలు పరిష్కరించాలని తదితర డిమాండ్ లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ కు అందజేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె మోహనరావు, ఎన్ గణపతి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సవర లఖ్య, త్రినాథ్, జగ్గారావు, పరుశురాం, కోటేష్, సంజయ్, పున్నలమ్మా, దశమి, రూపావతి, సుకుమారి, చింతామణి, కాంతమ్మ, నాగేశ్వరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు పరిష్కరించుటలో జాప్యం ఉండరాదు

- చట్ట ప్రకారం సత్వరమే పరిష్కరించి బాధితులకు న్యాయం అందించాలి

- జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి



విశాలాంధ్ర-శ్రీకాకుళం: ప్రజా పిర్యాదు నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజలు వినతలు ద్వారా తెలిపే ప్రజా సమస్యలను పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ చట్ట పరిధిలో పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశాలు జారీ చేశారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ కే.వీ మహేశ్వర రెడ్డి 81 పిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఫిర్యాదు దారులు సమస్యలను ఎస్పీ ముందు బాధితలు విన్నవించుకోగా, ఎస్పీ సానుకూలంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులతో జూమ్ ఫోన్ కాల్ ద్వారా మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని అధికారులకు సూచించారు. ఇందులో భాగంగా నడవలేని వృద్ధులు, వికలాంగులు వద్దకు జిల్లా ఎస్పీ స్వయంగా వెళ్ళి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు.

అధిక మొత్తంలో కేసులు రాజీకి ప్రయత్నం చేయండి

కోటబొమ్మాళి కోర్ట్ జూనియర్ సివిల్ జడ్జి ప్రసన్న లత

విశాలాంధ్ర -సంతబొమ్మాళి: అధిక మొత్తంలో కేసులు రాజకీయాలని, ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సు అధ్యక్షులు, మండల న్యాయ సేవా సంఘం (జూనియర్ డివిజన్) సివిల్ జడ్జ్, బి ఎంఆర్ ప్రసన్నలత అన్నారు. సోమవారం కోటబొమ్మాళి కోర్టు ఆవరణలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పోలీసులు బ్యాంక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థను 1948 ఏప్రిల్ ఏడవ తేదీన ఐక్యరాజ్యసమితిలో ఒక విభాగంగా ఏర్పాటు చేయడం జరిగిందనీ, 1950 నుంచి ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ప్రజలందరూ కూడా శారీరక మానసిక ఆరోగ్యాన్ని అభివృద్ధి పరచుకొనుటకు ప్రత్యేక దినోత్సవం గా జరుపుతున్నారన్నారు. ఈ సంవత్సరం నవజాత శిశువుల ఆరోగ్యము అదే విధంగా గర్భస్థ స్త్రీల యొక్క ఆరోగ్యము, అదే విధంగా పుట్టిన బిడ్డలకు వెంటనే అందించవలసిన ఆరోగ్య సహాయ సహకారాలు ఆహార పోషక అవసరాలపై ఈ సంవత్సరాన్ని ప్రత్యేకంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు శారీరక మానసిక ఆరోగ్యాన్ని సరిగా చూసుకోవడం ద్వారా సమాజానికి సేవ అన్నది చేయకపోయినప్పటికిని వారు కొంత అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి ప్రతి ఒక్కరు వారి వారి కర్తవ్యాలను సరిగా నిర్వహించడానికి శారీరక మానసిక ఆరోగ్యాలతో అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా మే 10 వ తారీఖున జరగబోయే జాతీయ లోకదాలత్ లో రాజీ పడదగ్గ కేసులను ముందుకు ఉండాలని గుర్తించాలని అదేవిధంగా ప్రమాదాల కేసులు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు వరకట్ నిషేధ కేసులను ముందుగా గుర్తించి రాజేపడే విధంగా చూడాలన్నారు. ముందుగా గుర్తించితే వారందరికీ కూడా కోర్టు ద్వారా నోటీసులను పంపించడం జరుగుతుందన్నారు. క్రిమినల్, మనోవర్తి కేసులు తదితర కేసులను ముందుగానే గుర్తించి ఆ కేసు నెంబర్ లో పార్టీలందరికీ కూడా నోటీసులను అందజేస్తున్నామని, ముందుగా ప్రీ లోక్ అదాలత్ ను నిర్వహిస్తామని, ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేసి, రాబోయే జాతీయ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు.

10 నెలల్లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు

- పలు గ్రామాల్లో శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బగ్గు

విశాలాంధ్ర-పోలాకి: రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందని, ఆ దిశగా ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశలో చర్యలు చేపడుతున్నారని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. మండలంలో సోమవారం పలు గ్రామాలలో సంక్షేమ అభివృద్ధి శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ మేరకు డోల నుండి జొన్నాం వరకు బి.టి రోడ్డు నిర్మాణం జొన్నాం నుండి వనిత మండలం వరకు బిట్-1, బిట్-2 బి.టి.రోడ్డు నిర్మాణానికి భూమి పూజ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం 10 నెలల్లో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. అనంతరం మండలం డోల పంచాయతీ పరిధిలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 6 కోట్ల అంచనా వ్యయంతో 6 కిలోమీటర్ల బీటీ రోడ్డు పనులు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం చెల్లాయి వలస గ్రామపంచాయతీలో డి పి ఎన్ రోడ్డు నుండి కేసి రోడ్డు వయా చెల్లాయివలస, ఓదిపాడు, చీడివలస వరకు రెండు కోట్ల రూపాయలతో బీటీ రోడ్ నిర్మాణ పనులు కు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే దిశగా చర్యలు చేపడుతున్నారని, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు అందజేయడమే ఆయన ప్రధాన లక్ష్మమని అన్నారు. ముఖ్యమంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రతీది అమలు చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యాలయాలకు దరఖాస్తులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: బాలికల భద్రత భవితకు భరోసానిచ్చే కేజీబీవీ పాఠశాలలలో పిల్లలను చేర్పించాలని స్థానిక ఎమ్మెల్యే పియుసి చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. 2025 -26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి, 11వ తరగతిలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు లు చేసేందుకు ఏప్రిల్ 11వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. అనాథలు, బడి బయట పిల్లలు (బడి మానేసిన) వారు పేద ఎస్సీ, ఎస్టి బీసీ మైనారిటీ బిపిఎల్ బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వివరించారు. అర్హు లైన బాలికలు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయా లన్నారు. ఈ దరఖాస్తులను ఇంటర్నెట్ ద్వారా పొందాలన్నారు. అలాగే ఏడవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరమునకు మిగులు సీట్ల భర్తీకి కూడా దరఖాస్తులు చేయాలని ఈ అవకాశాన్ని అర్హత గల బాలికలు వినియోగించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 7075159996, 7075039990 నెంబర్లకు ఫోన్ చేసి సందేహాల ను నివృత్తి చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణ దరఖాస్తులు సరిచూసుకోండి... ఇటీవల గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా వాటిని సరిచూసుకోవాలని టిడిపి కార్యాలయం విడుదల చేసిన ప్రకటన లో పేర్కొన్నారు. ఒకటి రెండు రోజుల్లో డిమాం డ్ ఎంట్రీ సైట్ నిలిచిపోనున్నదని వివరించారు. గ్రామ వార్డు సచివాలయాల అసిస్టెంట్ ఇంజ నీర్ల ద్వారా ఎంట్రీ అయిన దరఖాస్తులు (పొజి షన్) భూమి ధ్రువీకరణ పత్రాలు నిర్ధారించుకోవాలని తెలిపారు. పొజిషన్ సర్టిఫికేట్ లేని వారు గృహ నిర్మాణానికి అర్హులు కాలేరని త్వరి తగతిన పొజిషన్ సర్టిఫికెట్ చేయించుకోవాలని వివరించారు.

సమస్యలు పరిష్కారానికే మండలసర్వ సభ్య సమావేశం : ఎంపీపీ మేనక

విశాలాంధ్ర-హిరమండలం: మండలంలోని పలు సమస్యలు పరిష్కారం చేసేందుకే ప్రతీ మూడు నెలల కు ఒక సారి మండలసర్వ సభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ తూలుగు మేనక అన్నారు, సోమవారం ఎంపీడీఓ కార్యాలయసమావేశమందిరం లో మండలస్థాయి అధికారులు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్ లు తో ఎంపీడీఓ ఆర్ కాళీ ప్రసాద్ రావు అధ్యక్షతన మండలసర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ తూలుగు మేనక మాట్లాడుతూ ప్రతీ ఎంపీటీసీ పరిధిలో ని పలు సమస్యలు ను సభ దృష్టి కి తీసుకురావాలని అన్ని శాఖల అధికారులు పాల్గొంటున్నారు కనుక ప్రతి సమస్యను అధికారులు దృష్టి కీ తీసుకొని రావాలని పలు సూచనలు సలహాలు అధికారులకు ఇవ్వాలని ఎంపీపీ కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు తహసీల్దార్ఎన్ హనుమంత్ రావు, ఈఓ పి ఆర్డీ డి గోవిందరావు, ఎ ఓ బి సంధ్య, ఆర్ డబల్యూ ఎస్ జె ఈ ఈ ఎ సాగర్ ఆర్ అండ్ బి జె ఈ ఈ బి గోపాల్ హౌసింగ్ ఎ ఈ ఈ మాధవ్ రావు తదితరులు హాజరు కాగా ఎంపీటీసీ సభ్యులు బేవర గంగాధర్, ఏం రజని, టి శంకర్ రావు, కే ప్రియాంక, సి హెచ్ బుడ్డు, ఎస్ శ్రీదేవి, మండలప్రత్యేక సలహాదారులు టి తిరుపతి రావు మాస్టర్, వైస్ ఎంపీపీ ఎస్ వై కుంటరావు, సర్పంచ్ లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా....11మంది విద్యార్ధులకు గాయాలు

విశాలాంధ్ర -ఇచ్ఛాపురం: పట్టణంలో సోమవారం స్కూల్ విద్యార్థులను తీసుకెళ్తున ఆటో హోండా షోరూం సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 15 మంది విద్యార్థులకు గాను 11మంది గాయపడ్డారు. చిన్నారులతో ఉన్న ఆటో బోల్తా పడిన సంఘటన చూసిన స్థానికులు ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. అంతలోనే తేరుకుని చిన్నారులను కాపాడి హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ నిబంధనలను విరుద్ధంగా హెబ్రాన్ మిషన్ స్కూల్ విద్యార్థులను ఆటోలో కుక్కి ఎక్కించుకోవడమే కాక రాంగ్‌రూట్‌లో వెళ్ళేందుకు ముందున్న లారీని ఢీ ఓవర్‌టేక్ చేయాలనే ప్రయత్నంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికుల సమాచారం. విషయం తెలుసుకున్న పట్టణ ఎస్సై ప్రభుత్వాసుపత్రికి వద్దకు సిబ్బందితో వెళ్ళి చిన్నారులను పరిస్థితిని పరిశీలించి, సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రైవేటు స్కూళ్ళకు విద్యార్థులను పంపాలన తల్లిదండ్రుల తపన, ఆటో డ్రైవర్ల అత్యాసతో పరిమితికి మించిన చిన్నారులతో ప్రయాణం, ప్రైవేటు స్కూల్ యాజమాన్యాల నిర్లక్ష్యం వెరసి చిన్నారుల జీవితాలతో చెలగాటం జరుగుతుందని స్థానికులు చర్చించుకున్నారు. దూర ప్రాంతాల నుంచి విద్యార్థులను ఆకర్షించే పాఠశాలలు అక్కడి విద్యార్థుల తరలింపుకు సరైన రవాణా సదుపాయాలు కల్పించడంలో విఫలమౌతుండటం, లేదా ఆయా యాజమాన్యాలు వాహనాలకు నిర్ణయించిన అధిక ధరలకు భయపడి చిన్నారుల తల్లిదండ్రులను ఆటోలను ఆశ్రయిస్తున్న నేపథ్యంలో ప్రమాదాల తీవ్రత ఎక్కువైతే చిన్నారులను కోల్పోవాల్సిన దుర్గతి ఏర్పడుతుంది. అయినా ఇవేమీ పట్టవన్నట్లు సంబంధిత అధికారులు ఆటు ఆటోల రవాణా నిబంధనల అతిక్రమణపై కాని, ప్రైవేటు పాఠశాలల నిర్వాహణ లోపాలపై కాని కన్నెత్తి చూడలేనంత ఒత్తిళ్ళలో ఉండట విచారకరమని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

22ఎ సమస్యపై జిల్లా పరిషత్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

విశాలాంధ్ర -సోంపేట: జలంత్ర సోంపేటలోని 22ఎ బాధితుల నాలుగు వీధుల ప్రతినిధులు శ్రీకాకుళం జిల్లాపరిషత్‌లో సోమవారం జరిగే గ్రీవెన్స్ హాజరై సదురు సమస్యపై జేసీ, డీఆర్‌ఓ, ఏఓ, డీపీఓ, బీడీఓలను విడివిడిగా కలిసి సమస్యకు సంబంధించిన పూర్తి వివరాలతో అర్జీలను సమర్పించారు. సమస్య తీవ్రతను గుర్తించిన సదరు అధికారులు మాసమక్షంలోనే సోంపేట ఎమ్మార్వోకు, పంచాయతీ కార్యదర్శితో సమస్యపై ఎందుకు ఇంతవరకు ఏ కారణంతో సర్వే చేపట్టలేదు? ఇందుకు సంబంధించిన రిపోర్టును జిల్లా కార్యాలయానికి తక్షణమే స్పందించవలసినదిగా ఫోన్ ద్వారా ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇదే విషయమై జిల్లా ఎంపీ మరియు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కార్యాలయ ఇంచార్జ్ శ్రీనివాసరావుకు సమస్యను వివరించి అర్జీను అందజేశారు. మా అర్జీకు స్పందించి, సదరు జిల్లా అధికారులకు, మండల అధికారులకు సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదే విషయమై జిల్లా ఇంటెలిజెన్స్ విభాగం వారు విషయాన్ని తెలుసుకుని అర్జీ కూడా స్వీకరించారు.

కళ్లెదుటే మోసం...!

- పేదలకు అందజేస్తున్న ఉచిత బియ్యంలో అవకతవకలు

- ఎలక్ట్రికల్ కాటాను పక్కనపెట్టి... సొంత కాటాలతో నిలువ దోపిడి

- కాటా కింద 500 గ్రాములు గుండు, అయస్కాంతం తో ఉచిత బియ్యం కాజేస్తున్న డీలర్లు

విశాలాంధ్ర-టెక్కలి: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఆకలి తీర్చాలని ఉద్దేశ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా కొన్ని కోట్ల రూపాయలతో ఉచిత బియ్యం పంపిణీ ఏర్పాటు చేస్తుంది. ఇలాంటి తరుణంలో పేదలకు అందజేస్తున్న ఉచిత బియ్యం పంపిణీలో కొన్ని దగ్గర్ల అవకతవకలు ఇప్పటికీ కొనసాగుతు న్నాయి. అలాంటి అవకతవకలు సంఘటనే సోమవారం టెక్కలి మండ లం రావివలస గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలకు వెళితే... రావివలస గ్రామం దళితులు నివాసం ఉంటున్న కాలనీలో ప్రజలకు ఎప్పటిలాగే ఉచిత బియ్యం పంపిణీ వ్యాన్ సిబ్బంది చేస్తున్నారు. ఉచిత బియ్యం కొలిచిన తర్వాత అక్కడున్న ప్రజలకు బియ్యం ఐదు కేజీల కన్నా తక్కువగా ఉన్నట్లు అనుమానాలు వచ్చా యి. అయితే అదే సమయం లో బిజెపి స్వచ్ఛభారత్ కన్వీనర్ లింగరాజు అటు వైపుగా వెళుతున్న సమయం లో ఆ మాటలు విని రేషన్ పంపిణీ జరుగుతున్న వాహ ం దగ్గరికి వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీలలో వ్యాన్ సిబ్బంది చేస్తున్న దోపిడి బాగోతం బయటపడింది. బియ్యం పంపిణీ డీలర్ ఏర్పాటుచేసిన సొంత కాటాలో 500 గ్రాముల గుండుకు అయస్కాంతం అమిర్చి ప్రతి కార్డుదారుడ నుంచి బియ్యాన్ని దోచేస్తున్నాడంట. ఏమీ తెలియని అమాయక ప్రజలు కళ్ళు ముందే సొంత కాటాలు వేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. అసలు ప్రభుత్వం అందజేసిన ఎలక్ట్రికల్ కాటాను పక్కన పడేసి సొంత కాటాలు ఏర్పాటు చేసుకొని నిరుపేదలకు అందాల్సిన ఉచిత బియ్యం పంపిణీలో నిలువ దోపిడీ చేయడం, పేద ప్రజల కడుపులు కొట్టడం సరైనది కాదని వ్యాన్ సిబ్బందిపై లింగరాజు మండిపడ్డారు. ఎమిటి ఈ రేషన్ పంపిణీ అని వ్యాన్ సిబ్బందికి ప్రజలు అడగగా.. మేము ఎప్పుడూ ఇలానే చేస్తున్నాం.. మేము ఇలానే ఇస్తాం మీరు ఏమి చేసుకుంటారు చేసుకోండి అని దురుసుగా ప్రవర్తించారంట. ఇంత జరుగుతున్నా అధికారులు తనిఖీలు చేయకుండా, పట్టించుకోక పోవడం వల్లే పేదలకు అందవలసిన ఉచిత రేషన్ పంపిణీలో అవకతవకలు జరుగుతున్నాయని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు డీలర్ పై, వ్యాను సిబ్బందిపై తగు చర్యలు తీసుకోవాలని, నిరుపేద ప్రజలకు అందవలసిన బియ్యాన్ని సక్రమంగా అందేలా చూడాలని స్థానిక ప్రజలు కోరుకుంటున్నారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ద అవసరం

జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు మాట్లాడుతూ ఆరోగ్యం పైన ప్రజలందరూ శ్రద్ధ చూపాలన్నారు. డాక్టర్ జి . ఆర్ శ్రీకాంత్ రోగులను పరీక్షించి అవసరమైనవారికి రెడ్ క్రాస్ చైర్మన్ చేతుల మీదుగా మందులు అందించారు. ఈ శిబిరంలో మధుమేహ వ్యాధి పరీక్షలు, రక్తపోటు, బ్లడ్ గ్రూప్, రక్త శాతం, సాధారణ రోగాలు తదితర వాటికి రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ కార్యదర్శి బి. మల్లేశ్వరరావు, ఎం సి మెంబర్స్ బి. చిన్నయి రావు, ఎం కళ్యాణ్ చక్రవర్తి, సిబ్బంది ఏ నర్సింగరావు, గుణాకర రావు, కే సత్యనారాయణ, జి రమణ బి సతీష్ కుమార్, బేగం, పి చైతన్య కుమార్, సుజాత, ఎస్.ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మా భవిష్యత్తుకు దారి చూపండి

విశాలాంధ్ర-కవిటి: బెంతొరియాలకు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేసి మా భవిష్యత్తుకు దారి చూపాలని లొండపుట్టుగ గ్రామానికి చెందిన విద్యార్థులు కోరారు. కవిటిలో బెంతొరియాలు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం 467వ రోజు దీక్షలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే చాలా మంది యువకులు కుల ధృవీకరణ పత్రాలు లేక వారి జీవితాలు అంధకారంగా మారాయని ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ దీక్షలో కోదండ బిసొయి, అనిల్ బిసొయి, అనిల్ దొళాయి, ప్రవీణ్ దొళాయి, సుశాంత్ బిసొయిలు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుని కలిసిన స్టేట్ రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము

విశాలాంధ్ర-రణస్థలం: కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గురజాపు రాము సోమవారం శ్రీకాకుళం మంత్రి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఈ నెల 27 న విశాఖపట్నం లో జరగనున్న ఉత్తరాంధ్ర రజకులు అభినందన సభకు ముఖ్య అతిథిగా రావాలని కేంద్ర మంత్రి కి ఆహ్వానం అందజేశారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర రజక మాజీచైర్మన్ నారాయణరావు, రజక సంఘ నాయకులు పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

విశాలాంధ్ర-టెక్కలి: ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ రవికుమార్ హెచ్చరించారు. మేజర్ పంచాయతీ పరిధిలోని బాపారెడ్డి కాలనీలో ఉన్న ప్రభుత్వ భూములలో సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురైందని సమాచారం మేరకు పరిశీలించిన రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న రీ సర్వే ద్వారా అన్ని భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని పలాస ఆర్డీవో జి వెంకటేష్ అన్నారు. సోమవారం వజ్రపుకొత్తూరు మండలం, బెండి పంచాయతీ మహాదేవ పురం గ్రామంలో తహసీల్దార్ సీతారామ్మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన రీసర్వే ర్యాలీలో అయన పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో రీసర్వే అవసరాలను తెలియజేస్తూ ఆర్డీవోతో పాటు రెవెన్యూ అధికారులు ర్యాలీ నిర్వహించి అనంతరం గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామసభలో ఆర్డీవో మాట్లాడుతూ.. భూ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ఈ రీసర్వే కార్యక్రమాన్ని రైతులకు ఎటువంటి సమస్యలున్నా అర్జీలు ఇచ్చి సమస్యల పరిష్కారంతో ఈ కార్య క్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ అధికారులతో పాటు సర్వే విభాగానికి చెందిన అధికారులు, అన్ని రకాల భూములకు హద్దులు నిర్ణయించడంతో పాటు భూముల స్వభావాన్ని నిర్ధారించడం జరుగుతుందన్నారు. కార్య క్రమంలో డీటీ కె శ్రావణ్ కుమార్, సర్వేయర్ తిరుపతి రావు, డిఐఒఎస్ చంద్రశేఖర్ రావు లతో పాటు వీఆర్వో, విలేజ్ సర్వేయర్ లు సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన యువకుడు మృతి: నేత్రాలు సజీవం

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: మండలంలోని కింతలి మిల్లు జంక్షన్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎచ్చెర్ల గ్రామానికి చెందిన జలుమూరు వేణు (21) విశాఖపట్నంలోని కేజీహెచ్లో చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతిచెం దాడు. జరజాం గ్రామానికి చెందిన బస హరిప్రసాద్, వేణులు మోటారు బైక్ తో శ్రీకాకుళం నుంచి ఎచ్చెర్ల వైపు వస్తుండగా బైక్ అదుపుతప్పింది. ఈ ప్రమాదంలో బస హరిప్రసాద్ అక్కడికక్కడే మృతిచెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన వేణును తొలుత శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చేర్పించగా, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కేజీహెచ్కు తరలించారు. చికిత్స పొందుతూ వేణు అర్ధరాత్రి మృతిచెందాడు. వేణుకు తల్లి హేమలతతో పాటు అన్నయ్య, చెల్లి ఉన్నారు. తండ్రి గోపి ఆర్టీసీ డ్రైవర్గా పనిచేస్తూ కోవిడ్ సమయంలో చనిపోయాడు. వేణు మృతితో పుట్టెడు దుఃఖంలో కూడా కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్కు దానం చేశారు. అందర్నీ కలుపుగోలుగా ఉండే వేణు మృతితో ఎచ్చెర్లలో విషాద ఛాయలు అలముకుంది.

మృతుని కుటుంబానికి పరామర్శ



విశాలాంధ్ర-సోంపేట: సోంపేట మండలం, జింకిభద్ర గ్రామానికి చెందిన నిమ్మన నూకరాజు కుమారుడు నిమ్మన లక్ష్మీనారాయణ (35) అనారోగ్యంతో అకాల మరణం చెందినందున వారి కుటుంబ సభ్యులను సోంపేట ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు, సర్పంచ్ ప్రతినిధి తామాడ శేఖర్ పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరితో పాటు వైస్ సర్పంచ్ సాహుకారి జానీ, పెద్దకోట అనంత్, బత్తుల శంకరరావు, షణ్ముఖరావు, పిరియా ధర్మేంద్ర, భగీరథ, రాయల కేశవరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలి



విశాలాంధ్ర -శ్రీకాకుళం టౌన్: ప్రతి ఒక్కరు ఆరోగ్య నియమాలు పాటించాలని సీనియర్ మెడికల్ అధికారి వెంకటలక్ష్మి పిలుపునిచ్చారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆరోగ్యం మనిషికి గొప్ప వరం అని, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి దాని విలువ తెలుస్తుందన్నారు. సరైన వయసులో వివాహం సంతోషానికి నిలయమన్నారు. ఆసుపత్రి ప్రసవాలు తల్లి బిడ్డలకు ఆనందమన్నారు. ఆడబిడ్డకు 21, మగ బిడ్డకు 25 సంవత్సరాలు వివాహ వయసు అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో మాత్రమే గర్భిణీ తనిఖీలు చేయించాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు డాక్టర్ పువ్వల సుజాత, డిప్యూటీ డెమో వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ విజయలక్ష్మి, ఆశాలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం: తమ గ్రామంలో గల 30 ఏళ్ళుగా ఉన్న రావి చెట్టు మండపాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమణకు పాల్పడుతున్నారని దానికి ఆనించి ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు ప్రయత్నాలు చేస్తున్నారని అక్కడి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని మండల పరిషత్ అధ్యక్షురాలు బోర పుష్ప సోమవారం జిల్లా కలెక్టర్ ఫిర్యాదుల విభాగంలో కోరారు. కె. శాసనం గ్రామంలో ప్రభుత్వాధికారులు అప్పటి పంచాయితీ సభ్యుల సమ్మతితో కారంగి కారయ్య అనే వ్యక్తి తన సొంత డబ్బులు వెచ్చించి గ్రామస్తుల వినియోగం కోసం రచ్చబండను కట్టి అక్కడ నీడ కోసం రావి చెట్టును ఏర్పాటు చేసారని ప్రస్తుతం అక్కడి రచ్చబండను ధ్వంసం చేసి ప్రక్కనే ఉన్న సర్వే నెం. 37లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని దౌర్జన్యంగా ఇసురు ఫకీరు తదితరులు ఆక్రమించే ప్రయత్నాలు చేస్తున్నారని గత నెల 19, 22, 30 తేదీల్లో పోలీస్ రెవిన్యూ అధికారులకు కూడా దరఖాస్తులు చేసామని తెలిపారు. ఆక్రమణకు పాల్పడుతున్న ఇసురు ఫకీరు, ఇసురు జానకి, ఇసురు వెంకటేశం తదితరులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



మద్యం సేవించి వాహనాలు నడిపితే లైసెన్స్ రద్దు

- జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: మద్యం సేవించి వాహనం నడుపుతు పట్టుబడిన వాహన చోదకులు యొక్క లైసెన్స్ లను చట్ట ప్రకారం రద్దు చేయడం జరుగుతుందని,ఇప్పటికే 70 మంది వాహన చోదకులు లైసెన్సులు రద్దు చేయడం జరిగిందని మరో 60 మంది వాహన చోదకులు యొక్క లైసెన్స్ లను రద్దుకు జిల్లా రవాణా కమిషనర్ వారికి ప్రతిపాదనలు పంపించడం జరిగిందని ప్రజలు సదురు విషయాన్ని గుర్తించి మద్యం సేవించి వాహనాలు నడపరాదుని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ సోమవారం ఓ పత్రిక ప్రకటన జారీ చేస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ట్రాఫిక్ రూల్స్, రహదారి భద్రత నియమాలు తూచా తప్పకుండా పాటించాలని అన్నారు. శ్రీకాకుళం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలో భాగంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు పార్కింగ్ నకు కేటాయించిన నిర్దేశించిన ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వాహనాలను సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సదురు వాహనాలను చట్ట ప్రకారమే రిలీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్,రైతు బజార్, ఏడు రోడ్ల కూడలి వద్ద ట్రాఫిక్ రద్దీ దృశ్య ఆటోలు అధిక సంఖ్యలో రహదారి మార్గంలో నిలపరాదని, సమయానికి మించి వాహనాలు నిలిపినట్లైతే ట్రాఫిక్ ట్రోయింగ్ వాహనంతో ఆటోలుని సంబంధిత పోలీస్ స్టేషన్ కు తరలించడం జరుగుతుందని అన్నారు. మైనర్లు డ్రైవింగ్ నకు పాల్పడితే అందుకు బాధ్యులుగా వారి తల్లిదండ్రులు లేదా సంబంధిత వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

టిడిపి దౌర్జన్యాల నుండి రక్షణ కల్పించండి

- జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసిన తిలక్

విశాలాంధ్ర-టెక్కలి: జిల్లా కలెక్టర్, టెక్కలి ఆర్డీవో పై తీవ్రమైన పదజాలంతో దూషించడమే కాకుండా మూలపేట సర్పంచ్ జీరు బాబూరావును పోలీసుల సమక్షంలో చంపేస్తానని బెదిరించిన రాష్ట్ర మంత్రి అచ్చన్నాయుడు అనుచరుడు,సంతబొమ్మాళి టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు జీరు భీమారావు పై చర్యలు తీసుకోవాలని వైసీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ పేరాడ తిలక్ జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలను కోరారు. సోమవారం శ్రీకాకుళంలో జరిగిన గ్రీవెన్స్ సెల్ లో కలెక్టర్,ఎస్పీ లను కలిసి వినతిపత్రం అందజేశారు. టిడిపి నాయకులు గ్రామాల్లో గొడవలు రేపుతూ వైసిపి నాయకులను పై దాడులకు పాల్పడుతూ చంపేస్తామని బెదిరింపు చేస్తున్నారని అంతేకాకుండా అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వివరించారు. భీమారావు కలెక్టర్, ఆర్డీవో పై దుర్భాషణ ఆడడమే కాకుండా పోలీసుల సమక్షంలోనే మూలపేట సర్పంచ్ బాబురావు చంపేస్తామని బెదిరించారని బాబురావుకు రక్షణ కల్పించి భీమారావు పై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే కోటబొమ్మలి మండలం మహాసాహెబ్ పేట లో జిరాయితి భూమి నుంచి రైతుల అనుమతి లేకుండా దౌర్జన్యంగా టిడిపి నాయకులు రహదారి నిర్మాణం చేపట్టారని నిరుపేద కుటుంబానికి చెందిన వారి భూమిపై రహదారి ఏర్పాటు చేస్తున్నారని దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్ ను కోరారు. సంతబొమ్మాళి మండలం జగన్నాధపురం సర్పంచ్ రాములమ్మ పూర్వం నుంచి వున్న తన సొంత స్థలంలో వున్న కొబ్బరి చెట్లను రాజకీయ కక్షతో తొలగించారని, అంతే కాకుండా సర్పంచ్ పై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ఇంకా నియోజకవర్గంలోని పలు సమస్యలపై కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మాన టీవీఎస్ తాళం తెరిచిన కమిషనర్

- హైకోర్టు తీర్పుతో కార్యకలాపాలు ప్రారంభం

విశాలాంధ్ర-శ్రీకాకుళం: హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని ధర్మాన టీవీఎస్ షోరూం మళ్లీ తెరుచుకుంది. షోరూం నకు తాళం వేసిన అంశంపై హైకోర్టు జారీ చేసిన స్టే ఉత్తర్వులను అనుసరించి, శ్రీకాకుళం మున్సిపల్ కమిషనర్ బివిడి ప్రసాద్ రావు స్వయంగా తన సిబ్బందితో కలిసి సోమవారం షోరూం వద్దకు వెళ్లారు. అధికారికంగా తాళం తీసి, షోరూంను తిరిగి ప్రారంభించేందుకు అనుమతి ఇచ్చారు. గత కొద్ది రోజులుగా ఈ షోరూం మూసివేత చుట్టూ రాజకీయ, పరిపాలనా చర్చలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ట్రేడ్ లైసెన్స్ దాఖలు చేసినప్పటికీ, మున్సిపాలిటీ సాంకేతిక లోపాలను చూపుతూ ఏప్రిల్ 1న షోరూం తాళం వేసింది. దీనిపై ధర్మాన ధర్మారావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, న్యాయస్థానం మున్సిపల్ అధికారుల తీరును తప్పుబట్టి షోరూంను తక్షణమే తెరవాలని ఉత్తర్వులు జారీ చేసింది. కమిషనర్ చర్యతో ధర్మాన టీవీఎస్ సంస్థకు చెందిన షోరూం మళ్లీ కార్యకలాపాలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. వ్యాపార కార్యకలాపాల్లో అనవసర జోక్యం, కక్షసాధింపు చర్యలు ఊహించదగినవి కాదనే స్పష్టమైన సందేశాన్ని ఈ పరిణామం సూచిస్తుంది. "కోర్టు ఆదేశాల ప్రకారం తాము తక్షణమే చర్యలు తీసుకున్నాం. తదుపరి విచారణలో మా వాదనలు సమర్పిస్తాం," అని మున్సిపల్ అధికారులు స్పందించారు. ధర్మాన టీవీఎస్ సంస్థ ఉద్యోగులు మాట్లాడుతూ "కోర్టు తీర్పుతో న్యాయం జరిగినట్లు భావిస్తున్నాం. ప్రజలకు నిరంతర సేవలందించేందుకు మేము సన్నద్ధంగా ఉన్నామని తెలిపారు.

ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోతే నిర్లక్ష్యమా..!

కూటమి ప్రభుత్వానికి ప్రజాఆరోగ్యంపై శ్రద్ధ లేదు..

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

విశాలాంధ్ర-పలాస: ప్రజాఆరోగ్యంపై కూటమి ప్రభుత్వానికి కనీసం శ్రద్ధ లేదని ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోతే ముఖ్యమంత్రికి చీమకుట్టినట్లు కూడా లేదని, ప్రజలపై అంత నిర్లక్ష్యం తగదని మాజీ మంత్రి డాక్టర్ సిధిరి అప్పలరాజు అన్నారు. సోమవారం ప్రగతిభవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విలేకరుల సమావేశంలో మాట్లాడినప్పుడు పేదలకు ఉచితంగా ఏమి చేస్తామని ఎక్కడా చెప్పలేకపోయారన్నారు. జగన్ హయాంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రతీ పౌరుడు డేటా ఉండాలన్న ఉద్దేశ్యంతో సురక్ష ప్రోజెక్టు ద్వారా ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్యంపై సర్వే చేయడం జరిగిందన్నారు. చక్కగా నడుస్తున్న పథకాలను జగన్ పై కక్షసాధింపుగా పక్కన పెట్టేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. నేడు విపి సెంటర్లు పెడతామని చెబుతున్నారని, మరి ఇప్పుడు ఉన్న 100,200, ఆసుపత్రులు, పీహెచ్.సి లు, సి హెచ్ సి లు, వైద్య కళాశాలలు అమ్మేస్తారా..? లేక అద్దెకు ఇస్తామని బోర్డులు తగిలిస్తారా..? అని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీని దగ్గర వారైన బడాబాబులుకు కట్టబెట్టి ప్రైవేటు పరం చేయనున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.విద్య, ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని వాటిని ప్రైవేటుపరం చేస్తే ప్రజల హక్కుల కోసం బడాబాబులు వద్ద మోకరిల్లేలా చేస్తుందన్నారు. ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందా... ప్రైవేట్ వ్యక్తులు కోసం పనిచేస్తుందా..? అని ప్రశ్నించారు. కరోనా సమయంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉంటే రాష్ట్రం సర్వనాశనం అయిపోయి ఉండేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు పాలనపై పునరాలోచన చేసుకోవాలని కోరారు. జగన్ అసమానతలు తొలిగించాలని చూస్తుంటే చంద్రబాబు బడాబాబులు వద్ద ప్రజలను బానిసలుగా చేసి అంటరానితనాన్ని ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. అమరావతిలో మెగా మెడిసిటీ కట్టిస్తే రాష్ట్ర ప్రజలందరికి మేలు చేకూరుతుందా, ఎంత మంది రోగులు వెళ్లగలరని ప్రశ్నించారు. ఆరోగ్యశ్రీ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్టబెడితే రోగుల పేర్లు నమోదు చేసే సిబ్బందే వారికి సరిపోరన్నారు. పి.4 మెడల్ అంటే బానిసత్వాన్ని ప్రోత్సహించడమేనన్నారు. రాష్ట్రంలో గ్రోత్ రేట్ పెరిగిందని చెబుతున్నారని పెరిగితే అదాయం సమకూరితే ఎందుకు సూపర్ సిక్స్ అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఉదయం నుంచి రాత్రి వరకు అప్పు అప్పు అంటూ తిరుగుతున్నారని ఒక్క ఏడాదిలో అత్యధిక అప్పు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. చంద్రన్న భీమా అందిస్తామని మెనిఫెస్టో లో పెట్టారని కేంద్రంతో చర్చించి ఈ పథకం అమలు అయ్యే విధంగా చూడాలన్నారు. టిడిపి, జనసేన సభ్యత్వం కడితే ఇన్సూరెన్స్ ఇస్తామని బలవంతంగా ప్రజల నుంచి డబ్బులు కట్టించారని ఇది వ్యవస్థీకరణ నేరమన్నారు. హక్కుగా రావాల్సిన స్థితి నుంచి అడుకునే పరిస్థితికి తీసుకువచ్చారని విమర్శించారు. ఆరోగ్యశ్రీ సేవలు తక్షణమే పునరుద్ధించాలని, ప్రైవేటీకరణ చేస్తే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

భూమి సాగు హక్కులు కల్పించండి

విశాలాంధ్ర-హిరమండలం: గిరిజనులు సాగు చేస్తున్న భూములకు సాగు హక్కులు కల్పించాలని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు సవర గోపి,కె.రమేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయఅవార్నములో ధర్నా నిర్వహించారు. గిరిజన ప్రాంతాల్లో సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో హిరమండలం మండల పరిషత్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నా నిర్వహించడం జరిగింది. హిరమండలం మండలంలో ని మర్రిగూడ పంచాయతీ పరిధిలో గల జీలకర్రగూడ, మర్రిగూడ దాసుమానుగూడ, పుట్టిగాం, బంగారు గూడ, కిరిడివలస, అంతిలి, కూర్మవలస, బొందుగూడ తదితర గ్రామాలలో ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బొండిగూడ -ముల్లెలగూడ- సీతంపేటకు 10 కిలోమీటర్లు తారు రోడ్డు వెంటనే వేయాలని, బొండిగూడ లో గిరిజనలు 1500 ఎకరాలు సాగు చేస్తుంటే 120 ఎకరాలకు మాత్రమే పట్టాలిచ్చారని, సాగు భూములన్నిటికీ వెంటనే పట్టాలు ఇవ్వాలన్నారు. మర్రిగూడ నుంచి బొండుగూడకు రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గర్భిణీలను డోలేలో కిరిడివలస వరకు తీసుకొని వెళ్లి అక్కడ 108 ఎక్కించాల్సిన పరిస్థితి వస్తుందని, వెంటనే రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. వంశధార రిజర్వాయర్ నుండి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సాగుభూములకు నీరు అందించి వ్యవసాయం అభివృద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నా అనంతరం తహసీల్దార్ గారికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘము నాయకులు సవర.సింహాచలం, సవర.సంతోష్, సవర.వెంకయ్య సవర.ఉగాది, కె.అప్పన్న,ఎస్. మహేశ్వరీ, ఎస్.పద్మ, బిడ్డిక. నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కింజరాపు శార్వాణికి తుది వీడ్కోలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి: హరిశ్చంద్రపురం నియోజకవర్గ దివంగత మాజీ ఎమ్మెల్యే కింజరాపు కృష్ణమూర్తి నాయుడు భార్య కింజరాపు శ్రీమతి శార్వాణి (85) అంత్య క్రియలకు కుటుంబ సభ్యులంతా హాజరయ్యారు.ఆమెకు తుది వీడ్కోలు పలికారు. వృద్ధాప్యం రీత్యా ఆమె ఇవాళ తుది శ్వాస విడిచారు. విశాఖ నుంచి ఆమె భౌతిక కాయాన్ని స్వస్థలం శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, నిమ్మాడకు తీసుకుని వచ్చారు. ఆప్తులంతా తరలి వచ్చారు. ప్రాంతేతరంగా నివసిస్తున్న కింజరాపు కుటుంబ సభ్యులంతా నిమ్మాడకు హుటాహుటిన తరలి వచ్చారు. ఆమె అంతిమ యాత్రలో పాల్గొని కడసారి చూపునకు నోచుకున్నారు. వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడు తన పెద్దమ్మతో ఉన్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. కోటబొమ్మాళి మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ ఓఎస్డీ కింజరాపు ప్రభాకర్రావు, శ్రీకాకుళం శాసన సభ్యులు గొండు శంకర్ గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

విశాలాంధ్ర - ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు జిల్లాలోని 53 కేంద్రాల్లో ఈ పరీక్షలు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు నిర్వహిస్తున్నారు. అన్ని కేంద్రాల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ఈ పరీక్షలు ఈ నెల 21వ తేదీ వరకు జరగనున్నాయి.

ఉపాధి పనులు ప్రారంభం



విశాలాంధ్ర - సంతబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయితీలో సోమవారం గ్రామీణ ఉపాధి హామీ పనులను సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి దాసురాజు ప్రారంభించారు. శ్రీ గారమ్మ తల్లి మరియు నీలమ్మ తల్లి చెరువులలో భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ. దాసురాజు, వార్డ్ మెంబర్స్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన ఫీచర్లతో అర్బన్ క్రూయిజర్ హైరైడర్

విశాలాంధ్ర - శ్రీకాకుళం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈరోజు అర్బన్ క్రూయిజర్ హైరైడర్లో భద్రత, సౌకర్యం సౌలభ్యాన్ని పునర్నిర్వచించే ఫీచర్ అప్గ్రేడ్లను ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. భారతదేశపు మొట్టమొదటి సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ ఎస్ యూ వీ గా గుర్తింపు పొందిన అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఇప్పటికే 1 లక్ష వాహనాల అమ్మకాల మైలురాయిని దాటింది. ఇది దాని వినూత్న సాంకేతికత, అసాధారణమైన ఇంధన సామర్థ్యం, శక్తివంతమైన పనితీరు, ప్రీమియం డ్రైవింగ్ అనుభవంతో హృదయాలను గెలుచుకుంటూనే ఉంది. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ లో ఇప్పుడు ప్రధానంగా మెరుగైన భద్రత ఫీచర్లు జోడించబడ్డాయి. ప్రయాణీకుల భద్రతను నిర్ధారిస్తూ 6 ఎయిర్బ్యాగ్లు ఇప్పుడు అన్ని వేరియంట్లలో ప్రామాణికంగా ఉన్నాయి. అలాగే ఆటోమేటిక్ ట్రాన్స్మిషన్కు ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్ జోడించబడింది. సౌకర్యం కోసం 8-వే అడ్జస్టబుల్ పవర్ డ్రైవర్ సీట్, యాంబియంట్ లైటింగ్, క్యాబిన్ లోపల మెరుగైన గాలి నాణ్యత పర్యవేక్షణను నిర్ధారిస్తూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ డిస్ప్లే జోడించబడిందని అర్బన్ క్రూయిజర్ హైరైడర్ పరిచయం గురించి సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ వరీందర్ వాధ్వా అన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించాలి

విశాలాంధ్ర-టెక్కలి: ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఎం కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదికలో ఆయన ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పరిష్కార వేదికలో 19 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. రెవెన్యూ శాఖ 13, విద్యాశాఖ 02, పంచాయతీ రాజ్ 02, సర్వే అండ్ ల్యాండ్ రికార్డులు 02, తదుతరి శాఖలకు సంబంధించి అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. అనంతరం ఫిర్యాదుల పరిష్కారం పై అధికారులతో సమీక్షించారు. వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు తెలిపి వెంటనే పరిశీలించి పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని డివిజన్ స్థాయి అధికారులు, తదితరులు ఉన్నారు.

మంచినీరు అందించండి సార్..!

విశాలాంధ్ర-కవిటి: పంచాయితీల పరిధిలోని చిన్న గ్రామాలపై చిన్నచూపు చూస్తూన్నారని గత రెండు నెలలుగా మాకు మంచినీరు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని బల్లపుట్టుగ యువకులు బల్ల. జానకిరావు, బి. కోదండరావు, బి. వీరయ్య సోమవారం కవిటి తహసీల్దార్ కార్యాలయం గ్రీవెన్స్లో తహసీల్దారు బి. మురళీ మోహనరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కవిటి మేజర్ పంచాయతీ మధుర గ్రామాలైన చిన్న ఎర్రగోవిందపుట్టుగ, పెద్ద ఎర్ర గోవిందపుట్టుగ, బల్ల ఎర్రగోవిందపుట్టుగ అలాగే కరాపాడు పంచాయతీలోని బింగిపుట్టుగ, లండారిపుట్టుగ పంచాయతీలోని బల్లపుట్టుగ తదితర గ్రామాలకు గత రెండు నెలలుగా ఉద్దానం పథకం ద్వారా మంచినీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుమని తెలిపారు. దీనిపై ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు పలుమార్లు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని అన్నారు.రూ.750 కోట్లతో కొత్త మంచినీటి పథకంలో మా గ్రామాలను పూర్తిగా విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.మీరు తక్షణమే చర్యలు తీసుకుని నీరు అందించాలని కోరారు.